# పచ్చని శ్రీకాకుళం జిల్లాని కాలుష్యమయం చేయకండి

మానవ హక్కుల వేదిక ఏర్పడి పదేళ్ళు పూర్తయిన సందర్భంలో మేము నవంబర్ 2008 లో ప్రచార యాత్రలు చేపట్టాము. సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం కాబోతున్న కవిటి, కంచిలి, సోంపేట, సంతబొమ్మాళి మండలాల్లోనూ, రసాయినిక కాలుష్యంతో బాధపడుతున్న పైడి భీమవరం ప్రాంతం లోనూ, నాగార్జున అగ్రికెమ్ కాలుష్య ప్రభావిత గ్రామాలైన అరిణాం, అక్కివల్స, కేశవదాసుపురం, పట్టుసాలిపేటల్లోనూ పర్యటించాం. ఈ ప్రాంతాలలో విస్థాపనకు గురికాబోతున్న రైతులూ, కూలీలూ, చేతివృత్తిదారులూ, కాలుష్య బాధితులూ, మత్స్యకారులూ తమ సమస్యలను వివరించారు. భవిష్యత్తు పై ఆవేదన వ్యక్తపరిచారు.

**తాజావార్త**

సంతబొమ్మాళి, సోంపేట మండలాల్లో రానున్న రెండు పవర్ ప్లాంట్లకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల కమిటీ అనుమతి నిరాకరించింది. ఆ రెండు ప్రాంతాలూ పర్యావరణ రీత్యా అతి విలువైనవని పేర్కొంది. ఇది ప్రజల విజయం. రాజకీయ ఒత్తిడికి లొంగి మునుముందు ఈ ప్లాంట్లకు దొడ్డిదారిన అనుమతినిచ్చే అవకాశం లేకపోలేదు కాబట్టి ప్రజలు అప్రమత్తంగా వుండాలి.

మన జిల్లాలో నిర్మాణం కానున్న రెండు సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ల వల్ల ఎంతో అభివృద్ధి సాధిస్తామనీ, అందుచేత వాటిని ఆహ్వానించాలనీ కొందరు మేధావులు వాదిస్తున్నారు. ఎవరి 'అభివృద్ధికి' ఎవరు మూల్యం చెల్లిస్తున్నారో ఆలోచించమని వారిని మానవ హక్కుల వేదిక కోరుతున్నది. అభివృద్ధి అనేది అందరికీ వర్తించాలి. వేలాది ఎకరాల భూమిని మింగి, పరిసరాలను విషపూరితం చేసి ప్రజల జీవన ప్రమాణాలను దిగజార్చే ప్రక్రియ అభివృద్ధి అనిపించుకుంటుందా? కేవలం కొందరు పారిశ్రామిక వేత్తల జేబులు నింపి ప్రజలను బిచ్చగాళ్ళను చేసేది అభివృద్ధికాదు, విధ్వంసం మాత్రమే. మనకు కావలసింది నిజమైన అభివృద్ధి. వినాశనం కాదు. ప్రజల జీవితాలను తల్లి కోడిలా కాపాడాల్సిన కొందరు ప్రజాప్రతినిధులు వారికి జీవనోపాధినిస్తున్న భూములలో పవర్ ప్లాంట్లు నిర్మించాలని ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేయడం ప్రజల్ని మోసం చేయడమే.

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అని ఆనాటి ఉద్యమాల ద్వారా మనం వేలాది ఉద్యోగాలు సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ కాదు ఈ పవర్ ప్లాంట్లు. స్థానిక ప్రజల్ని తరిమేసి, ఆప్రాంతంలో కాలుష్య కారక పరిశ్రమలు నిర్మించి, పరిశ్రమ దారులకు లాభాలు చేకూర్చి, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఏదీ ప్రజల అభివృద్ధికాదు. అక్కడ వ్యవసాయంపై ఆధారపడిన ప్రజలకీ, తంపర భూమిలో చేపలు పట్టి బతుకుతున్నవారికీ వారివృత్తులలో అధిక ఉత్పత్తిని సాధించే మెలకువలను నేర్పడంతో పాటు మంచి మార్కెటింగ్ సౌకర్యాలు వంటి చర్యలను చేపడితే ఆయా ప్రాంతాలు సమగ్రాభివృద్ధిని సాధిస్తాయి.

## సూపర్ థర్మల్ ప్లాంట్లు

సంతబొమ్మాళి మండలంలో ఈస్టుకోస్ట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ 'భావనపాడు పవర్ ప్లాంట్' ను నెలకొల్పాలని చూస్తున్నది. అలాగే సోంపేట మండలంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ మరొక థర్మల్ ప్లాంటును నిర్మించబోతున్నది. వీటికి రాష్ట్రప్రభుత్వం వేలాది ఎకరాల భూమిని తీరప్రాంతంలో అప్పచెప్పింది. ఇది చాలదన్నట్టు ఇంకా పెద్ద మొత్తంలో భూమిని సేకరించి కట్టబెట్టాలని చూస్తోంది. వీటి నిర్మాణం జరిగితే అక్కడ ప్రజలు జీవనాధారం కోల్పోతారు, యాచకులుగా మారిపోతారు. పచ్చనిపొలాల నుంచి ఆ రైతాంగాన్ని దూరంగా నెట్టివేయడం చాలా అన్యాయం. అలాగే బీలా భూములపై ఆధారపడ్డ వేలాది మత్స్యకారులు ఆలంబన కోల్పోతారు. సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర, కాకరపల్లి, ఆకాశలక్కవరం, కోటపాడు, పోతినాయుడుపేట, ఆసమీపంలోనే విదేశీ పక్షులకు నిలయమైన తేలినీలాపురాలు కాలుష్యపురాలుగా మారబోతున్నాయి. అట్లాగే కవిటి, సోంపేట మండలాలూ ముఖ్యంగా కుత్తురు, రుషికుడ్డ, రామయ్యపేట, గొల్లగండి, బారువపేట, బెంకిలి, మాణిక్యపురం ప్రాంతాలూ పూర్తిగా కాలుష్యానికి లోనుకానున్నాయి. మన పచ్చని ఉద్దానం అధ్వాన్నంగా మారిపోతుంది. పర్యావరణ, స్థల అనుమతులు లభించక ముందే పర్యావరణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ సంతబొమ్మాళిలోని బీలా భూముల్లో త్రవ్వకాలు చేపట్టి రోడ్డు పనిమొదలు పెట్టారు. ఇది పూర్తిగా చట్ట వ్యతిరేకం. పర్యావరణ ప్రభావిత అంచనా నివేదిక కూడా తప్పుల తడకగా ఉంది. ఉదాహరణకు ప్రాజెక్టు సైటునుండి 10 కి.మీ. విస్తీర్ణంలో ఎక్కడా పక్షుల సంచారం లేదని పేర్కొన్నారు. అది పచ్చి అబద్ధం అని మనకి తెలుసు. వాస్తవానికి ప్రాజెక్టు స్థలానికి 3 కి.మీ. దూరంలోనే తేలినీలాపురంలో పక్షుల అభయారణ్యం ఉన్నది. పైగా స్థానిక ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఒక తప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి పర్యావరణ అనుమతికోసం ప్రయత్నిస్తున్నారు. దీనికి స్థానిక రాజకీయ నాయకుల పూర్తి మద్దత్తు ఉండడం చాలా సిగ్గుచేటు.

థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే ప్రధాన కాలుష్యం బూడిద. సంతబొమ్మాళి, సోంపేట మండలాలలో రానున్న ప్లాంట్ల నుంచి ఈ కాలుష్యం భారీ స్థాయిలో ఉంటుంది. కాల్చిన విదేశీ బొగ్గు నుండి విషపదార్థాలైన పాదరసం, గంధకం వెలువడతాయి. ఇవి భూమిలోకి ఇంకి భూగర్భజలాన్ని కలుషితం చేస్తాయి. ఫలితంగా జీవపరిణామాన్నే ప్రభావితంచేసే అవకాశం ఉంది. ఇలాంటి

ప్లాంట్లు నెలకొల్పే బదులు ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి పూనుకోవచ్చుకదా? సౌర, పవన, తరంగ విద్యుత్ లాంటి ప్రత్యామ్నాయాలగురించి సీరియస్‌గా ఆలోచన చేయవచ్చుగదా?

వ్యవసాయం గిట్టుబాటు కాదు, భూములకు మంచి ధర వస్తుంది కనుక అమ్మివేసి పట్టణాలకు పోదామనుకునే వారి మాట అటుంచుదాం కానీ, అదే ప్రాంతంలో అధిక సంఖ్యలో నివసిస్తున్న చిన్న రైతుల, కూలీల, ఇతర చేతి వృత్తుల వారి గతిఏమవుతుంది? పవర్‌ప్లాంటు వస్తే వ్యాపారాలు బాగుంటాయి, ఉద్యోగాలు వస్తాయనేది కేవలం భ్రమ. ఇటువంటి ప్రైవేట్ సంస్థల పరిశ్రమల్లో ఆధునిక యంత్రాలు వాడి తక్కువ శ్రమని ఉపయోగిస్తారు. కనుక అక్కడ వచ్చేవి పిడికెడు ఉద్యోగాలు మాత్రమే. అదికూడా పెద్ద చదువులు చదువుకున్నవారికి మాత్రమే. స్థానికులకు వచ్చేవి దాదాపు శూన్యమే.

మన జిల్లాలో వందకు పై చిలుకు పరిశ్రమలు మూతపడ్డాయి. వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నడిపిస్తే ఉపాధిని కాపాడుకోవచ్చు. సోంపేట నుండి నౌపడ వరకూ ఉప్పు పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం పూనుకోవచ్చుకదా? అనేక మందికి ఉపాధినిచ్చిన ఆముదాలవలస పంచదార మిల్లును గత ప్రభుత్వం కారు చౌకగా అమ్మేసింది. ఈ ప్రభుత్వమేమో చోద్యం చూస్తోంది.

## మందుల కంపెనీల కాలుష్యం

పైడిభీమవరం లోని పారిశ్రామికవాడ ప్రాంతంలో కొన్ని పరిశ్రమలు మూత పడినప్పటికీ, ఆంధ్రా ఆర్గానిక్, రెడ్డీస్, సరాక, అరవింద్ లాబ్స్ లాంటి రసాయనిక పరిశ్రమలు ఒకే ప్రాంతంలో నిర్మించడం వలన కాలుష్యపు తీవ్రత విపరీతంగా వుంది. ఈ పరిశ్రమలనుండి వెలువడే కాలుష్య జలాలను శుద్ధి చేయకుండా పైపు లైను ద్వారా సముద్రంలోకి విడుదలచేస్తున్నారు. పైపు లైన్లు లీకై పొలాలను నాశనం చేస్తున్నాయి. ఈ వ్యర్థ పదార్థాలు సముద్రాన్ని కలుషితం చేయడం వలన మత్స్య సంపద దెబ్బతింటోంది. మత్స్యకారులు చేపలవేట సరిగ్గా జరగక గుజరాత్ లాంటి దూర ప్రాంతాలకు వలస పోతున్నారు. మత్స్యకారులకు సముద్రమే జీవనం. తీర ప్రాంతంపై వాళ్ళకున్న సహజ హక్కును ఇటువంటి పరిశ్రమలు కాలరాస్తుంటే చూస్తూ ఊరుకుందామా? సముద్రజలాలను కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదు.

## నాగార్జున అగ్రికెమ్ నేర చర్యలు

అరిణాం, అక్కివలసల్లోని నాగార్జున అగ్రికెమ్ రసాయనిక పరిశ్రమ గత 13 ఏళ్ళుగా నిత్యం పరిసర గ్రామాలపై కాలుష్యపు మబ్బులు గుమ్మరిస్తూనే వుంది. ఆ గ్రామాల ప్రజలూ, ప్రజాప్రతినిధులూ దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తూనే వున్నారు. నాగార్జునా అగ్రికెమ్ వారు కాలుష్యపు నీటిని పైపులైను ద్వారా సముద్రంలోకి విడుదల చేసే ప్రక్రియను పార్టీలకు అతీతంగా లావేరు మండల ప్రజాప్రతినిధులు ప్రజల పట్ల బాధ్యతతో నిలుపుదల చేయించడం సంతోషించ దగ్గ పరిణామం. వారి చర్యలను ఇతర ప్రాంతాల ప్రజాప్రతినిధులు అనుసరించాలి. ఇటువంటి విధ్వంసకర పరిశ్రమలను ప్రశ్నిస్తే "జిల్లాకు పరిశ్రమలు ఎలావస్తాయని" కొందరు అంటున్నారు. కాని, కాలుష్య నియంత్రణ మండలి పరిశ్రమల యాజమాన్యాలను ప్రశ్నించడం లేదు. కాలుష్యనివారణ యంత్రాలు కనీసస్థాయిలోకూడా లేకుండానే ఉత్పత్తికి అనుమతిస్తున్నది ఈ మండలి. మరి కాలుష్య నియంత్రణ మండలి అవినీతిని గానీ, పరిశ్రమల నేరపూరిత చర్యలను సమర్థిస్తున్న జిల్లా యంత్రాంగాన్నిగానీ గట్టిగా వ్యతిరేకించవలసిన అవసరం లేదా?

ఆహార భద్రతకు భవిష్యత్తులో తీవ్రముప్పు వాటిల్లబోతోంది. వ్యవసాయ భూములను పరిశ్రమలకూ, ప్రత్యేక ఆర్థిక మండళ్లకూ (సెజ్‌లకు) తీసుకోకూడదని సోనియాగాంధీ నుండి రాజశేఖర్ రెడ్డి వరకూ ఒక పక్క అంటున్న సమయంలోనే ఇచ్ఛాపురం నుండి తడ వరకూ ఒక కోస్టల్ కారిడార్ రూపకల్పన వారి ప్రభుత్వహయాంలోనే జరిగిపోయింది. ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. ఈ కారిడార్, సెజ్‌ల ప్రక్రియ తీరప్రాంత వాసుల జీవితాలను నాశనం చేస్తుంది. కాకినాడ సెజ్‌కు స్వాగతం పలికిన రెండు నాల్కల తెలుగుదేశం, దీన్ని వేగవంతం చేసిన కాంగ్రెస్, సెజ్‌లకు స్వాగతం పలికిన బెంగాల్ వామపక్ష ప్రభుత్వం, సెజ్ జపం చేస్తున్న భా.జా.పా. ప్రభుత్వాలు ప్రజాప్రయోజనాలను పణంగా పెట్టి అభివృద్ధి మంత్రం జపిస్తున్నాయి. అధికారం కోసం అర్రులు చాస్తున్న సినీగ్లామర్ పార్టీలు సైతం దీనికి భిన్నంగా ఆలోచించడం లేదు.

అందుకే ఇటువంటి విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకించడానికి ప్రజలే సరైన కార్యాచరణకు పూనుకోవాలి. కాకినాడ సెజ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేసిన అక్కడ ప్రజానీకం అందరికీ ఆదర్శం. గోవా సెజ్‌లను నిలువరించిన ప్రజలు అందరికీ మార్గదర్శకులు. బెంగాల్‌లో సింగూరు నుండి టాటాలను తరిమివేసిన రైతాంగం, నందిగ్రాంలో తిరగబడిన జనం అందరికీ ఆదర్శనీయులు. మన జిల్లాలో సోంపేట మండలం రామయ్యపట్నం వద్ద బీచ్ సాండ్ మైనింగ్ కు వ్యతిరేకంగా నిలబడ్డ ప్రజలకు మా అభినందనలు. మన జిల్లాలో తీవ్ర విధ్వంసం సృష్టించబోతున్న రెండు సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లనూ, ఇతర రసాయనిక పరిశ్రమలనూ వ్యతిరేకించమని ప్రజలకు పిలుపునిస్తున్నాము. మీ ఆందోళనకు మానవ హక్కుల వేదిక సంపూర్ణ సహకారాన్ని ఎప్పుడూ అందిస్తుంది. ప్రజాస్వామిక అభివృద్ధిని ఆహ్వానిద్దాం. విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకిద్దాం.

**మానవ హక్కుల వేదిక**
**Human Rights Forum (HRF)**
**శ్రీకాకుళం జిల్లా**

**19-1-2009**